

జిసిసి మేనేజర్‌గా కొండబాబు

ప్రజాశక్తి-జి.మాడుగుల :జిసిసి బ్రాంచ్ మేనేజర్‌గా నందోలి కొండబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జీకే వీధి జిసిసి బ్రాంచ్ మేనేజర్‌గా పని చేసి బదిలీపై జి.మాడుగుల వచ్చారు. ఇక్కడ పని చేసిన బ్రాంచ్ మేనేజర్ కొండన్న జికె వీధి బ్రాంచ్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కొండబాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కాఫీ కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తానని, సకాలంలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందే విధంగా దృష్టి సారిస్తానని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కొండబాబు

పసికందుల మరణాలను పట్టించుకోరా ?

▸▸ సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు ▸▸ పొర్లపాదొర్‌లో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పొర్ల పొదుర గ్రామంలో ఐదుగురు పసికందులు మృతి చెందడంతో వైద్య అధికారుల పనితీరు పై సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు ఆగ్రహ వ్యక్తం చేశారు. సకాలంలో సరైన వైద్య సేవలు అందక పసికందులు ఒకరి తర్వాత ఒకరు మృత్యువాత పడ్డారని, తక్షణమే వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. వరుసగా మృత్యువాత గురవుతున్న ఘటనను తెలుసుకున్న ఆయన బుధవారం పొర్లొపాదొర్‌ను సందర్శించారు. మృతి చెందిన పసికందుల తల్లితండ్రులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, పుట్టిన పిల్లలు మూడు నెలలకె మృతి చెందారని, ఉబ్బసం, పాలు తాగకపోవడం, దగ్గు, జలుబులతో నెల రోజులకే ఒకరి తర్వాత ఒకరు ఐదుగురు మృతి చెందారన్నారు. వైద్య అధికారులు పట్టించుకోలేదన్నారు. జడ్పిటిసి గంగరాజు ఈ విషయంపై ఐటీడీఏ పీవో రోణంకి .గోపాలకృష్ణ, జిల్లా వైద్య అధికారులకు అక్కడ నుండే ఫోన్లో జరిగిన ఘటనను వివరించారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రెండవ వైద్య అధికారిణిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 17న పొట్టంగి. సుమీల కు జన్మించిన మూడు నెలల పాప, ఈనెల 2న పొట్టంగి. సుబ్బమ్మ జన్మించిన 3 నెలల బాబు మతి చెందారన్నారు. గత గత సంవత్సరం 11వ నెల 23న నిమ్మక భారతికు జన్మించిన 3. నెలల పాప, 10వ నెలలో 18న పొట్టంగి. శాంతి కు జన్మించిన బాబు, 10వ నెల 10న సోమల కళ్యాణకు జన్మించిన 3 నెలల బాబు మృతి చెందారన్నారు.అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన నందుల నవీన్‌కు చెందిన 8. నెలల బాబు ఈనెల 9న, అనంతగిరి బొడ్డచెట్టు గ్రామానికి చెందిన దీసరి. సింహాద్రికి చెందిన 9. నెలల పాప డిసెంబర్ నెల 30న మృతి చెందారన్నారు. పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దకోట గ్రామానికి చెందిన కోనేపు. సుశీల బాలింత ఈనెల 17న మృతి చెందగా గత నెల 15 రోజుల క్రితం అనేకమంది బాలింతలు, పసిపిల్లలు మృతి చెందిన ఘటనలు మరి ఎన్నో ఉన్నాయన్నారు.గర్భిణీలకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందక పోవడంతోనే మృత్యువాతకు గురవుతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్య కారణమని, తక్షణమే దీనిపై ఐటిడిఏ, జిల్లా ఉన్నత అధికారులు ఈ మరణాలపై విచారణ చేపట్టాలన్నారు. అధ్యయన బృందాలు ఏర్పాటు చేసి ఎందుకు మృతి చెందారో అనే దానిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టోకూరు సర్పంచ్ కిల్లో. మోసియా, వార్డు మెంబర్ పాంగి .లక్ష్మణరావు, పాంగి రవిచంద్ర, గ్రామస్తులు నగేష్, కుమార్, ఆశ కార్యకర్త గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

తాగునీటి పథకాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్ - అధికారులతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-పాడేరు:జల్ జీవన్ మిషన్లో చేపట్టిన తాగునీటి పథకాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి పథకాల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి పథకాల నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని స్పష్టం చేసారు. పైపులు వేస్తే పని అయినట్టు కాదని, బోరువెల్, మంచి నీటి ట్యాంకు నిర్మించి తాగునీటి సరఫరా చేయాలన్నారు. మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు పనులు వేగంగా ప్రారంభించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు అప్పగించిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పూర్తి చేసిన పనులకు సకాలంలో బిల్లు చెల్లించడానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి పథకాల నిర్మాణాలను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం గ్రామీణ నీటి సరఫరా విభాగం డైరీ 2023ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ పి.లీలాక్రిష్ణ, డిఇఇలు జివిఎస్. ప్రకాష్, ఎం.జయరామ్, జి.గోపాలక్రిష్ణ, జి.రుక్మాంధరరాజు, చంద్ర కిరణ్, 11 మండలాల ఎఇలు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మ్యుటేషన్లు అప్రూవల్ చేయకుంటే షోకాజ్ నోటీస్‌లు

పాడేరు : మ్యుటేషన్లు తాహశీల్దార్లు అప్రూవల్ చేయకపోతే షోకాజ్ నోటీస్ జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. మ్యుటేషన్ల పై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. బుధవారం ఆయన కార్యాలయం నుండి రెవెన్యూ, సర్వే విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మ్యుటేషన్ల ప్రక్రియలో వెనుకబడి ఉన్నామన్నారు. రోజుకు నాలుగైదు ఉంటాయని రెవెన్యూ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసారు. ఈ నెలాఖరు నాటికి రీ సర్వే లక్ష్యాలను అధిగ మించాలని స్పష్టం చేసారు. భూముల రీ సర్వేపై మండల సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈనెలాఖరు నాటికి జిల్లాలో 150 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్ధేశించారు. ఇప్పటికి 95 గ్రామాలు పూర్తి చేసారని, మిగిలిన గ్రామాల్లో సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మండల సర్వేయర్లు రీ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న గిరిజనులకు డి. ఫారం పట్టాలు పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. సెల్ టవర్లు నిర్మాణానికి అవసరమైన భూములు గుర్తించి నివేదించాలని సూచించారు.



బస్సు కాంప్లెక్స్ వద్ద జన తాకిడి

ఆర్‌టిసి కాంప్లెక్స్ కిటకిట

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఆర్‌టిసి కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ పూర్తి కావడంతో విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల నిమిత్తం సొంతూళ్లకు, అత్తమామలు, తల్లిదండ్రుల ఇళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. వచ్చిన ప్రయాణికులతో అర్‌టిసి బస్ కాంప్లెక్స్ కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచి కాంప్లెక్స్‌లో పెద్దగా ప్రయాణికుల రద్దీ లేకపోయినా, మధ్యాహ్నం 12 గంటల తర్వాత నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారింది. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కాంప్లెక్స్ సందడిగా కనిపించింది. బస్ స్టేషన్ ఎదురుగా నిలిపిన ప్రైవేటు జీపులు, ఆటోలు, ఇతర వాహనాల్లోనూ ప్రయాణికుల రద్దీ నెలకొంది. దీంతో గత నాలుగు రోజులుగా పాడేరు పట్టణంలో ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లపై ప్రస్తుతం జనసంచారం పెరగడంతో పాటు వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ పెరిగింది. గురువారం కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.



జీపులను ఆశ్రయిస్తున్న యువతీ యువకులు

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- డుంబ్రిగూడ: గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన 1/70 భూ బదలాయింపు చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత గిరిజనుల భూములకు రక్షణగా రాజ్యాంగంలో 1/70 భూ బదలాయింపు చట్టాన్ని కల్పించారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన నేతరులు అతిక్రమించడంతో పాటు అడిగిన గిరిజనులపై వ్యతిరేకంగా విమర్శలు చేయడం మానుకోవాలని చెప్పారు. తక్షణమే ఈ చట్టాన్ని ఏజెన్సీ ప్రాంతంలో పటిష్టంగా అమలు పరిచి గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారిజం పండగ

ప్రజాశక్తి -పెదబయలు

మండలంలోని కిముడుపల్లి గ్రామంలో భారిజం పండగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముడు సంవత్సరములకు ఒక్కసారి కిముడుపల్లి పంచాయతీ ప్రజలు కిముడుపల్లి గ్రామంలో ఈ పండుగ అనాదిగా నిర్వహిస్తున్నారు. గ్రామ సావడి వద్ద పాట పాడుతూ బ్రిటీష్ కాలంనాటి పూర్వీకుల ఆయుధాలకు పూజలు నిర్వహించారు. వీటిని ప్రదర్శన చేసి వాటి వివరాలు యువతకు తెలియజేస్తారు. అనంతరం సావడిలో ఆయుధాలతో విన్యాసాలు చేస్తారు. గిరిజన సంప్రదాయ పద్ధతిలో గుమ్మలట, దింసా, భజన వంటి అనేక రకాలైన సాంస్కతి కార్యక్రమాలు, ప్రత్యేక వేషాధారణతో ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో గెలుపొందిన వారికి ప్రథమ, రెండవ, ముడవ బహుమతులను గండేరు. నిరీక్షణరావు ఆర్థిక సహాయంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడా సింహాద్రి, గండేరు రంగావు, కోడా.కృష్ణ ముర్తి, చింతడ. శ్రీరాంమర్తి, కొడా వరహానంధం, కిముడు శివలింగం నాయుడు, ఆనంద్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న గిరిజనుడు, తిలకిస్తున్న స్థానికులు

వారపు సంతలో సంక్రాంతి శోభ



వేషధారణలతో సంతలో సందడి చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి

గిరిజన గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. 10 రోజుల నుండి ఊళ్లలో రంగుల ముగ్గులు వేసుకుంటూ జనాలు సందడి చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో మూడు రోజులు క్రితమే పండుగను ముగించుకున్నప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆలస్యంగా ప్రారంభించుకున్నారు. బుధవారం కొండిబ పంచాయతీ డమకు వారపు సంతలో కుండిబ గ్రామానికి చెందిన గిరిజనులు రంగులను పూసుకుని సంతలో డప్పులు, సన్నాయి వాయిస్తూ ధింసా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ప్రతి దుకాణంకు వెళ్లి ఉప్పు, మిరప, కూర కాయలు వంటి వస్తువులను సేకరించుకున్నారు. ఈ కూరకాయలతో చివరి రోజు పండుగని సంతరించుకొని గ్రామస్తులందరూ భోజనాలు ఏర్పాటు చేసుకొని పిల్లా పాపలతో గడుపుతారు.



ధింసా నృత్యం చేస్తున్న యువతీ, యువకులు

ముగిసిన సంక్రాంతి సంబరాలు

డుంబ్రిగూడ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిసాయి. మూడు రోజులపాటు స్థానిక గ్రామస్తులు, యువతి, యువకులు చిన్నా పెద్ద తేడా లేకుండా గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యం ప్రదర్శిస్తూ ఆనందంగా పండుగను జరుపుకున్నారు.



జిల్లా పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి జ్యోతి

త్వరితగతిన రహదారి పనులు పూర్తి చేయాలి

జిల్లా పరిషత్తు సమావేశంలో జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏలేశ్వరం, గొంతువానిపాలెం, జె.అన్నవరం రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని రాజబొమ్మంగి జెడ్పిటిసి ఒడిగుల జ్యోతి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జ్యోతి మండలంలో నెలకొన్న పలు సమస్యలను వినిపించారు. ఏలేశ్వరం, జె.అన్నవరం ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ రహదారిలో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారని, అవి నేటికీ పూర్తి కాలేదని చెప్పారు. ఈ పాఠశాలలో సుమారు 600 పైబడి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, ఇటీవల ఇదే పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేశారని తెలిపారు. ఇక్కడే నూతనంగా జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేశారన్నారు. దీంతో తరగతి గదులు సరిపోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దష్ట్యా భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పిహెచ్‌సిల్లో మందుల కొరత లేకుండా చూడాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఏజెన్సీలో భూ ఆక్రమణలు ఆపాలి

ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అర్జున్ దొర

ప్రజాశక్తి -ఎటపాక



1/70 చట్టానికి విరుద్ధంగా మండలంలోని రామగోపాలపురం రెవెన్యూ పరిధిలో యథేచ్ఛగా భూ ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిని రెవెన్యూ అధికారులు వెంటనే ఆపాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాకా అర్జున్ దొర డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రామగోపాలపురం రెవెన్యూ పరిధిలో 2ఎ భూములను అనేక సంవత్సరాలుగా గిరిజనేతరులు ఆక్రమణలో ఉంచుకొని, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన గిరిజనేతరులు కోనుగోలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి, భూమికి భూమి కోసం అనేక సందర్భాల్లో అధికారులను అడిగితే ఎక్కడా 2ఎ భూముల లేవని చెప్పారని గుర్తు చేశారు. రామగోపాలపురం, లక్ష్మీపురం రెవెన్యూల పరిధిలో వందల ఎకరాల భూమి గిరిజనేతరుల ఆక్రమణలో ఉందని, ఆ భూమిని గుర్తించి, సేకరించి పోలవరం నిర్వాసితులైన వేలాది గిరిజన కుటుంబాలకి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీలో భూ బదలాయింపు నిరోధక చట్టం ఉన్నప్పటికీ గిరిజనేతరులు చట్టాన్ని గౌరవించకుండా యథేచ్ఛగా అమ్మకాలు, కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణలు చేయడం లేదన్నారు. ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత ఒకరి భూమిని మరొకరికి ట్రాన్స్‌ఫర్ చేసే క్రమంలో అనేక అవకతవకలు జరుతున్నాయని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోకుంటే ఆ భూమిని అర్హులైన గిరిజనులకి ఇచ్చేదానికోసం ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి-జి.మాడుగుల

మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో బుధవారం స్థానిక సర్పంచ్ మాలన్న ఆధ్వర్యంలో చెత్తాచెదారం తొలగించారు. ఈ చెత్తాచెదారాన్ని రిక్షాలో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారాన్ని వేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరు షాప్ ముందు డస్ట్ బిన్నులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

దేహదానానికి అజయ్ కుమార్ అంగీకారం

ప్రజాశక్తి- అనకాపల్లి

జ్యోతి బసు వర్ధంతిని పురస్కరించుకొని అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ మరణానంతరం తన దేహాన్ని దానం చేయడానికి అంగీకారం తెలిపారు. జ్యోతి బసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ఆధ్వర్యంలో మరణానంతరం వైద్య పరిశోధనలకు పార్థివ దేహాలను అందజేస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం అజయ్‌కుమార్ తన అంగీకర పత్రాన్ని జ్యోతి బసు దేహదాన ప్రోత్సాహక సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి వివి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్‌కు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న అజయ్ కుమార్

11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం విశాఖ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థాన ప్రాంగణాల్లో ఫిబ్రవరి 11న జాతీయ లోకదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు గుత్తల గోపి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ లోకదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, ఇన్సూరెన్స్, జీవీఎంసీ, బ్యాంకు తదితర సంస్థల కేసులను పరిష్కరించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులికృష్ణ తెలిపారు.

లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవాలన్న సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి ఇరు పక్షాలు తమ సంసిద్ధతను వ్యక్తం చేస్తూ, ఆయాకోర్టులలో గానీ లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని ముందుగా సంప్రదించి, పరిష్కరించుకోవాలని సూచించారు. 2023లో నిర్వహించనున్న తొలి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులు, న్యాయవాదులు, జిల్లా ప్రజలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు

మంచి చిత్రాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - సీతమ్మధార : మంచి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించి, ప్రోత్సహించాలని వైజాగ్ ఫిలిం సొసైటీ, నగర కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో 'సినిమా బండి' చిత్ర ప్రదర్శన, దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం లఘు చిత్ర దర్శకులకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఉత్సాహం, ఇష్టం, నిరీక్షణ ఉంటే దేనినైనా సాధించవచ్చునని నిరూపించిన చిత్రం సినిమా బండి అన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ తాను ఎక్కడా శిక్షణ తీసుకోలేదని, గతంలో లఘు చిత్రాలు నిర్మించిన అనుభవం, స్నేహితుల సహకారంతో రూపొందించిన సినిమా బండి చిత్రం గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులను వైజాగ్ ఫిలిం సొసైటీ తరపున ఘనంగా సత్కరించారు. వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పారిశ్రామికవేత్త భరణికాన రామారావు, సీనియర్ నటులు ఎస్‌కె.మిశ్రో, వైజాగ్ జర్నలిస్టుఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, నండూరి రామకృష్ణతోపాటు సొసైటీ సంయుక్త కార్యదర్శి బి చిన్నారావు, కార్యవర్గసభ్యులు ఆర్ శివకుమార్, జి బాబ్జి, చిత్ర దర్శకుడు ప్రవీణ్ తండ్రి రామచంద్ర ప్రభు, తల్లి అంజు సినీ ప్రియులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం : మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం సాధ్యపడుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఏయూ న్యాయ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన 'జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్'లో భాగంగా 'మ్యూజింగ్స్ ఆఫ్ మీడియేషన్' అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వలన సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ ప్రక్రియలో ఎవరూ నష్టపోవడం, లాభపడటం జరగదన్నారు. ఇరు పార్టీల మధ్య సత్సంబంధాలను పునరుద్ధరించడానికి మధ్యవర్తిత్వం ఉపకరిస్తుందన్నారు. అదే సమయంలో మధ్యవర్తిత్వం ఎంతో సంక్లిష్టమైన విషయమని, దీనికి ప్రత్యేక నైపుణ్యాలు, శిక్షణ అవసరమన్నారు. వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అనుకూలమైనదిగా నిలుస్తున్న విధానాన్ని పలు ఉదాహరణలతో వివరించారు. కాలహరణ నివారణకు ఇది అత్యుత్తమ సాధనంగా నిలుస్తుందన్నారు. మధ్యవర్తిత్వం మన దేశానికి కొత్తకాదన్నారు. రాజుల కాలం నుంచి ఇవి అమలులో ఉన్నాయని, బ్రిటీషు కాలంలో గ్రామ పెద్దలు ఈ బాధ్యతను నిర్వర్తించే వారన్నారు. నేడు దేశ వ్యాప్తంగా ఐదు కోట్ల వాజ్యాలు న్యాయస్థానాలలో పరిష్కారం కోసం ఉన్నాయని, వీటిని పరిష్కరించడానికి తగినంత మంది న్యాయమూర్తులు లేరన్నారు. వివాదాల కారణంగా సమాజంలో సోషల్ హార్మోని దెబ్బతింటోందన్నారు. మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండటం, తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.
ఎయు విసి చార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ సమస్యలు, వివాదాలు పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి సాధనంగా ఉపకరిస్తుందన్నారు.

లోకేష్ పాదయాత్ర యువతను కదిలిస్తుంది

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27 నుంచి రాష్ట్రంలో చేపట్టనున్న పాదయాత్ర సెన్సేషనల్ అవుతుందని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి టిడిపి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కూడా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్ల మేర జరగనున్న లోకేష్ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయని చెప్పారు. యువత దేశానికి కీలకమన్నారు. అటువంటి వారు మన రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటువంటి సమయంలో చేపడుతున్న లోకేష్ పాదయాత్ర ఎంతోమందిని కదిలిస్తుందని అన్నారు. చంద్రబాబు, లోకేష్ తమ పార్టీ కుటుంబ పెద్దలని వ్యాఖ్యానించారు. వారిని ఎల్లవేళలా కలిసే అవకాశం ఉందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ గొప్పతనాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, పశ్చిమ ఎమ్మెల్యే పివిజిఆర్.నాయుడు (గణబాబు), ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామ్, చిక్కాల విజయ్ బాబు, రాజమండ్రి నారాయణ, పైల ముత్యాలనాయుడు, గోగినేని సాంబశివరావు, గొలగాని వీరారావు, కోరాడ రాజబాబు, విల్లూరి డాక్టర్ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించరూ..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ రూరల్ మండలం పరిధిలోని విశాలాక్షి నగర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకొని నాటు కోళ్ళు అమ్మే ప్రాంతంలో ఉన్న 300 చదరపు గజాల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బుధవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని కబ్జాదారులు అక్రమంగా చదును చేసి అన్యాక్రాంతం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారన్నారు. ఈ విషయం పలు వార్తా పత్రికల్లో వచ్చిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. విలువైన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు కబ్జాల వెనుక ఉన్న అక్రమార్కులను గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫిబ్రవరి 28న కెఎంసిబి ఎన్నికలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కనకమహలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఖాళీ అయ్యే మూడు డైరెక్టర్ల పదవులకు ఫిబ్రవరి 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది కె.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ ఎన్నికలు ఆ రోజున ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అదేరోజు ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా నామినేషన్లను దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్‌కు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. దాఖలైన నామినేషన్లను ఫిబ్రవరి 17న పరిశీలిస్తామని, చెల్లుబాటైన నామినేషన్ల వివరాలను మరుసటి రోజున ప్రకటిస్తామని తెలిపారు. 19న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చునని చెప్పారు. పోటీ అనివార్యమైతే 28న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర సుందరీకరణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు జివిఎంసి ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు పక్కగా నిర్వహించాలని, పారిశుధ్యానికి కావలసిన పరికరాలు అవసరం ఉండి కొనవలసినట్లయితే వెంటనే అమోదం కోసం నివేదికలు పంపించాలని, ప్రధాన కాలువలలోని అడ్డంకులను తొలగించాలని, ఖాళీ స్థలాల్లోనూ, రోడ్డు మార్జిన్లలోనూ, చెత్త పడే ప్రదేశాలలోనూ అవసరాన్ని బట్టి డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా ప్రజలలో అవగాహన కల్పించి వారిలో చైతన్యం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి

సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి కార్యక్రమాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-పాడేరు టౌన్

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌బిఐ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పాత ఆసుపత్రి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 10 మందికి పైగా టిడిపి కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్‌టిఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఎస్.చిట్టిబాబు, రొబ్బి రాము, జి.సింహాచలం, కె.రమేష్, కె.వెంకట సురేష్ కుమార్, ఎం.వరహాలురాజు, శివకుమార్, జ్ఞానేశ్వరి, వెంకటకుమారి, పారిజాతం, శంకర్, సుబ్బలక్ష్మి, లక్ష్మణరావు, జగదీష్, వెంకటరమణ, శ్రీనువసరావు, విశ్వనాథం, కొండలరావు, పూర్ణచంద్రరావు, సత్యనారా యణ, రామ్ నాయుడు, దొరబాబు, గణపతి, పిన్నయ్య, శ్రీధర్, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

జి.మాడుగుల: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు మత్స్యరాస వరహాలరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరహాలరాజు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో టిడిపి కార్యకర్తలు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాలలు వేశారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బుజ్జి బాబు, లక్ష్మణ్, ఆనంద్, జోగుల .రంజిత్ పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని స్థానిక మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఆ పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు వి.నాగేశ్వరరావు, కే.సుబ్బారావు, భాస్కరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, పలువురు టిడిపి నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దూసరపాము ఎంపీటీసీ సత్యనారాయణ, టిడిపి నాయకులు డి శివాజీ రాజు, ఎం బుల్లెమ్మ,డిం బకేశ్వరరావు, ఎం మోహన్, పి సత్తిబాబు, గోపి, మధు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలం వేటుకూరు పంచాయతీ పరిధి పందిరీమామిడి కోట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు గురుకు శేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేవుల సోమలమ్మ, వేటుకూరు మాజీ సర్పంచ్ కథల వెంకటలక్ష్మి, గొర్లె హరి భాస్కర్, షేక్ బషీర్, భీశెట్టి అప్పాజీ, కర్రి సన్యాసిరెడ్డి, దూడ సువర్ణ కర్ణ కుమార్, సార్ల మంగిరెడ్డి, అందాల సూర్యనారాయణ రెడ్డి తెలుగు యువత అధ్యక్షులు మండా రత్నాజి, ఎంపీటీసీ కొరగాని సువర్ణ రాజు, వీరవల్లి జార్జి బాబు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వా శ్రీను ఆధ్వర్యాన ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, పార్టీ నాయకులు పుట్టి రమేష్ బాబు, చేకూరి సత్యనారాయణ, చేకూరి వెంకట రమేష్, విజ్జిగిరి రవితేజ, చిలువేరు వెంకటేశ్వర్లు, సింగిరెడ్డి వెంకటరెడ్డి, గార్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో టిడిపి నాయకులు బొర్ర కృష్ణ, సన్యాసిరావు ఆధ్వర్యంలో దుర్గాదేవి షెడ్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్త చిటికెల రాము, ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు లక్ష్మణ్, రాము, విష్ణు, ఎన్.చిన కొండ, కాశి యదాల రాము తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో రక్తదానం చేస్తున్న టిడిపి నేత, పక్కనే మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి


మారేడుమిల్లిలో రోగులకు పండ్లు, రొట్టెలు ఇస్తున్న టిడిపి నేతలు


జి.మాడుగులలో..


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి


సీలేరులో..


ఎటపాకలో...

గీతంలో మొక్కల జియో ట్యాగింగ్ పూర్తి

ప్రజాశక్తి -మధురవాడ : దేశ, విదేశాల నుంచి తెప్పించి, గీతంలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, పూలపొదలకు రెండు నెలలుగా గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో చేపడుతున్న జియో ట్యాగింగ్ బుధవారంతో పూర్తయిందని ఆర్కిటెక్చర్ డీన్ ప్రొఫెసర్ మోహన్ తెలిపారు. ఆయా మొక్కల విశేషాలను వందకుపైగా మొక్కలకు క్యూఆర్ కోడ్‌తో జియోట్యాగ్ చేసామన్నారు. గీతం విద్యార్థులతోపాటు సందర్శకు లెవరైనా మొక్కల సమాచారం తెలుసుకోవాలంటే, ఆయా మొక్కలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తమ మొబైల్‌లో స్కాన్ చేస్తే, వాటి శాస్త్రీయ నామంతోపాటు ఆయా మొక్కల భౌగోళిక ప్రాంతం, ఇతర వివరాలను తెలుసుకోవచ్చన్నారు. రానున్న రోజులలో గీతంలోని ఔషధ మొక్కల వివరాలతో ప్రత్యేక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. విజయవంతంగా మొక్కల జియోట్యాగింగ్ పూర్తి చేయడంపై గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అభినందించారు.


జియో ట్యాగింగ్ పరిశీలిస్తున్న గీతం విసి

'సినిమాబండి' చిత్ర దర్శకునికి అభినందన

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థి సినిమాబండి చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులను ఎయు విసి ఆచార్య ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో సత్కరించారు. బుధవారం వర్సిటీకి విచ్చేసిన దర్శకుడు ప్రవీణ్‌ను వీసీ వర్సిటీ తరపున సత్కరించారు. చిత్ర సినిమాటోగ్రాఫర్ రోహిత్, వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశ రావు పాల్గొన్నారు.


ప్రవీణ్‌ను అభినందిస్తున్న ఎయు విసి

ఇపిడిసిఎల్‌పై బకాయిల గుదిబండ

6 నెలలుగా రాని మొత్తం రూ.2,236 కోట్లు
అధికభాగం ప్రభుత్వం ఇవ్వాల్సిందే..
ఆర్థికంగా చితికిపోతున్న సంస్థ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు బకాయిలు పెద్ద సమస్యగా మారాయి. ప్రభుత్వ సబ్సిడీలు చెల్లించకపోవడం, అధిక విద్యుత్ వినియోగిస్తున్న ప్రభుత్వ, ప్రయివేటు వినియోగదారుల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో సంస్థ తేరుకోలేకపోతోంది. విద్యుత్ సరఫరా చేసిన మేరకు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోతుంది. ఆర్నెళ్లుగా రూ.50 వేలు విద్యుత్ బిల్లు చెల్లించని 16,694 ఎల్‌టి, హెచ్‌టి సర్వీసుల ద్వారా సంస్థకు రూ.2,236.82 కోట్లు రావాల్సివుంది. అందులో స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.1167.39 కోట్లు వుంది. ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 16,036 ఎల్‌టి సర్వీసుల నుంచి రూ.749.11 కోట్లు, 658 హెచ్‌టి సర్వీసుల నుంచి రూ.1487.71 కోట్లు బకాయి వున్నాయి. గతేడాది సెప్టెంబరు 30 నాటికి ఆర్నెళ్లుగా 50 వేల రూపాయల బిల్లు చెల్లించని కేటగిరీల వారీ సర్వీసుల వివరాలను ఇపిడిసిఎల్ తయారుచేసి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమర్పించింది. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ సంబంధిత, బిల్లులు నిలిపివేసిన, కోర్టు వివాదాలు, స్థానిక సంస్థలు, ఎస్‌సి, ఎస్‌టి, అండర్ డిస్‌కనెక్ట్ (యుడిసి) ఎల్‌టి సర్వీసులు 1211 నుంచి రూ.27.02 కోట్లు రావాల్సివుంది. విజయనగరం జిల్లాలో 932 సర్వీసుల నుంచి రూ.25.47 కోట్లు, విశాఖపట్నం జిల్లాలో 4,771 సర్వీసుల నుంచి రూ.131.38 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 3269 సర్వీసుల నుంచి రూ.161.52 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 5853 సర్వీసుల నుంచి రూ.403.71 కోట్లు సంస్థలకు రావాల్సివుంది.

హెచ్‌టి సర్వీసులకు ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో బిల్లులు చెల్లించుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడంతో ప్రతి నెలా బిల్లు చెల్లించే స్తోమతవున్న హెచ్‌టి వినియోగదారులు నెలల తరబడి చెల్లించడంలేదు. ఈ తరహాలో 11 సర్వీసుల నుంచి రూ.69.69 కోట్లు రావాల్సివుంది. హెచ్‌టి సర్వీసులకు ప్రభుత్వమే మినహాయింపు ఇవ్వడంతో సంస్థ ఒత్తిడి చేసి కట్టించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.447.76 కోట్లు రావాల్సివుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు సరిపడా బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లులు చెల్లించుకోలేని దుస్థితిలో ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. అధికారులను బతిమలాడి బిల్లులు వసూలు చేసుకోవడం తప్ప ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసే సాహసం సంస్థ చేయలేకపోతోంది. యుడిసి సర్వీసులు రెండింటి నుంచి రూ.29.30 లక్షలు రావాల్సివుంది. కోర్టు కేసుల్లో వున్న సర్వీసులు మినహా మిగిలిన బకాయి రాబెట్టేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించడంలేదు.


ఇపిడిసిఎల్ భవనం (ఫైల్ ఫొటో)

ఇపిడిసిఎల్‌కు హెచ్‌టి సర్వీసుల నుంచి రావాల్సిన బకాయి వివరాలు

వివరాలు	సర్వీసులు	బకాయి (రూ.కోట్లలో..)
విద్యుత్ నిలిపినవి	113	46.53
కోర్టు కేసులు	324	923.43
ప్రభుత్వ కార్యాలయాలు	208	447.76
వాయిదాల పద్ధతి	11	69.69

కొండెక్కిన నిమ్మకాయ

ఒక్కసారిగా పెరిగిన ధరలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాధారణంగా నిమ్మకాయల ధర వేసవిలో ఎక్కువగా, చలికాలంలో తక్కువగా ఉంటుంది. అయితే ఈ ఏడాది చలికాలంలో కూడా వీటి ధర చుక్కలనంటుతోంది. బస్తా నిమ్మకాయల ధర రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఇటు వ్యాపారులు.. అటు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, తూర్పుగోదావరి జిల్లా యాదవోలు నుంచి లారీల్లో నిమ్మకాయలు దిగుమతి అవుతాయి. జ్ఞానాపురం మార్కెట్ నుంచి నిమ్మకాయలు నగరంలోని రైతు బజార్లకు, ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతాయి. నిమ్మకాయలు దిగుమతి ధర రెట్టింపు కావడంతో రిటైల్ వ్యాపారులూ ధర పెంచారు. ఇప్పటి వరకూ రూ.10కి 10 కాయలు అమ్మేవారు. రూ.10కి ఇప్పుడు నాలుగే ఇస్తున్నారు. అవీ సైజు బాగా తగ్గిపోయాయి. పంట తగ్గడం వల్ల సరుకు ధర పెంచేశారని వ్యాపారులు అంటున్నారు. చలికాలంలోనూ ఇంత ధర ఏమిటని కొనుగోలుదారులు మండి పడుతున్నారని జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారి దాడి రామకృష్ణ చెప్పారు. సంక్రాంతి వంటి ప్రధాన పండగ రోజులలో నిత్యావసరాల ధరలతో పాటు నిమ్మకాయలు కూడా ప్రియం కావడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

రహదారి భద్రత.. అందరి బాధ్యత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ) : రహదారి భద్రత మనందరి బాధ్యత అని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు - స్వచ్ఛత పక్షోత్సవాలను బుధవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలను ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం తలపెట్టామని చెప్పారు. డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్‌లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రతి నెలా జరిగే రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించిన భద్రతా అంశాల పరిష్కారానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. చాలా చోట్ల బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్‌గా మార్చామన్నారు. నగరంలో గుంతల రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలుగుతున్నామన్నారు. అధిక రోడ్డు ప్రమాదాలు ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యపానం, అతి వేగం వల్ల జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప రవాణా అధికారి రాజారత్నం, డిసిపి సుమిత్ గరుడ్, ఉప రవాణా సిబ్బంది, ది ఎబిలిటీ పీపుల్ సంస్థ డైరెక్టర్ దిలీప్ పాత్రో పాల్గొన్నారు.

తెలుగు శక్తి యుద్ధభేరి సీడీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు శక్తి ఆధ్వర్యాన త్వరలో నిర్వహించే యుద్ధభేరి ఆడియో సీడీని మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. వైసిపి ప్రభుత్వ పాలనా తీరును ఎండగడుతూ ఈ సీడీ రూపుదిద్దుకుందని తెలిపారు. తెలుగు శక్తి అధ్యక్షుడు, విశాఖ వాసి బివి.రామ్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకే యుద్ధభేరి అని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అరాచకమైన పాలన కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కీర్తిశేషులు ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తెలుగు శక్తి ప్రజలను చైతన్య పరుస్తోందన్నారు.

రైతులకు మాస్టర్ కార్డు డిజిటల్ పేమెంట్ సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 10 లక్షల మంది రైతులకు మాస్టర్ కార్డు డిజిటల్ పేమెంట్ సేవలు అందించి సరికొత్త మైలురాయి చేరిందని మాస్టర్ కార్డు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తారనాథ్ ప్రకటించారు. నగరంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సన్నకారు రైతులకు మరింత వేగంగా చెల్లింపులు చేయడానికి మాస్టర్ కార్డు తోడ్పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో లీఫ్ వ్యవస్థాపకులు పలట్ విజయ రాఘవన్, బసిక్స్ సిఇఒ డి.సత్త్రియ పాల్గొన్నారు.

లీడ్ విజేతలుగా 'ప్రజ్ఞ' విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్.. తమ లీడ్ ఛాంపియన్‌షిప్ - 2022 విజేతలను వెల్లడించింది. విజేతలకు లీడ్ కో - ఫౌండర్, సిఇఒ సుమీత్ మెహతా అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో పోటీపడి విజయం సాధించడం సాధారణ అంశమేమీ కాదన్నారు. విశాఖకు చెందిన ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పురుషోత్తమ చారి మాట్లాడుతూ తమ విద్యార్థులు నవ్య, హిమవర్ష లీడ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్నామని, ఈ తరహా జాతీయ స్థాయి పోటీల కారణంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అలాగే వైజాగ్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ధ్రువిక జూనియర్ విభాగంలో ఫైనలిస్ట్‌గా నిలిచారు.